క్లుప్తంగా

విశేషంగా రాహు-కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతు పూజలు విశేషంగా నిర్వహించారు. ఆదివారం కావడంతో రాహు-కేతు పూజలను అనువైన రోజుగా భక్తులు భావిస్తారు. కాశీవిశ్వేశ్వరస్వామి రాహు-కేతువుల ప్రసిద్ధి గాంచిన ఆలయం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు కొమ్మవరపు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దోషాలు గలవారు కుటుంబ సమేతంగా వచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం విశేష అలంకరణలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించారు.

నేటి నుంచి సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

రాజుపాలెం: మండలంలో పలు రైతు భరోసా కేంద్రాలలో సోమవారం నుంచి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి వెంకటనరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను ఇస్తున్నట్లు తెలిపారు. జనుము, జీలగ కేజీ రైతులకు సబ్సిడీపై రూ.44కే ఇస్తున్నామని, పిల్లిపెసర కిలో సబ్సిడీపై రూ.67లకు అందజేయనున్నట్లు తెలిపారు. ఎకరానికి జనుము, జీలగ 10 కిలోలు, పిల్లిపెసర 8 కిలోలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పాస్ పుస్తకం తీసుకుని రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. మిగిలిన నాలుగు గ్రామాలైన గణపవరం, బలిజేపల్లి, చౌట పాపాయపాలెం, అనుపాలెంలో గల రైతు భరోసా కేంద్రాలలో మంగళవారం నుంచి పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తామని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని తెలిపారు.

విద్య ద్వారానే సమాజంలో గౌరవం



సత్తెనపల్లి: విద్య ద్వారానే సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయని కార్డ్ సంస్థ పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ టి.అమర్నాథ్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన బాల బాట డెవలప్మెంట్ ఆర్గనైజర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. అమర్నాథ్ మాట్లాడుతూ విద్యతో అభివృద్ధి సాధించవచ్చునన్నారు. సత్తెనపల్లి ఏరియా కో-ఆర్డినేటర్ జి.రవి మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించి ఉన్నతమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బాల బాట డెవలప్మెంట్ ఆర్గనైజర్లకు రెండు నెలల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 30 మంది డెవలప్మెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముప్పాళ్ళ: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన ముప్పాళ్ళ సమీపంలో ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికుల వివరాల మేరకు.. సత్తెనపల్లి రంగా కాలనీకి చెందిన సుధీర్, శృతి ద్విచక్రవాహనంపై నరసరావుపేట నుంచి వస్తుండగా, ముప్పాళ్ళ మండలం కుందురువారిపాలేనికి చెందిన బత్తుల కాంతారావు ముప్పాళ్ళ నుంచి ఇంటికి వస్తున్నాడు. ముప్పాళ్ళ సమీపంలోని ఆర్ఆర్ వెంచర్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

దుర్గి మండలంలో కొనసాగుతున్న తనిఖీలు

దుర్గి: ఎన్నికల అనంతరం ఎటువంటి గొడవలు, అల్లర్లు జరగకుండా శాంతిభద్రతలను కాపాడటం కోసం మండల వ్యాప్తంగా గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన దుర్గిలో 30 మందికి పైగా పోలీసు సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు చేశారు. అనుమానంగా ఉన్న ప్రతి ఇంటినీ సోదాలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి సమాచారాన్ని సేకరించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 25 వాహనాలను సీజ్ చేశామన్నారు. గతంలో ముటుకూరు, ఓబులేశునిపల్లె, మించాలపాడు, ధర్మవరం, కంచరగుంట, కాకిరాల తదితర గ్రామాలలో తనిఖీలు నిర్వహించగా ఎటువంటి మారణాయుధాలు, బాంబులు లభించలేదు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా యువకులు అనైతిక చర్యలకు పాల్పడకుండా తమ జీవితాలను సరైన దారిలో మలచుకోవాలన్నారు. వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలతో సంప్రదిస్తే వాటిని యజమానులకు అందిస్తామన్నారు.

ఫలితంపై ఉత్కంఠ

- కట్టావారిపాలెం 1వ బూత్ నుంచి ఓట్ల లెక్కింపు
- రంగా కాలనీ 274వ బూత్‌తో ముగింపు
- కౌంటింగ్‌లో ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు
- 20 రౌండ్లలో తేలనున్న సత్తెనపల్లి అసెంబ్లీ ఫలితం



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో కౌంటింగ్ పై ఉత్కంఠ నెలకొంది. జూన్ 4న సత్తెనపల్లి నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు సత్తెనపల్లి రూరల్ మండలంలోని కట్టావారిపాలెం ఒకటవ నంబర్ పోలింగ్ బూత్ నుంచి ప్రారంభం కానుంది. నియోజకవర్గంలో 274 పోలింగ్ బూత్‌లో పోలింగ్ నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,42,047 మంది ఓటర్లు ఉండగా అందులో 2,10,500 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 1,03,116 మంది, పురుషులు 1,07,381 మంది, థర్డ్ జెండర్ ముగ్గురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.97 ఓటింగ్ శాతం నమోదైంది. వీరు కాక దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 255 మంది హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 1,926 మంది, ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 288 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇవి కాక 281 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. వీరు 4వ తేదీ ఉదయం 7:59 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటారు. నరసరావుపేట సమీపంలోని కాకాని జేఎన్‌టీయుకే లో జూన్ 4న ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగు తుంది. ఒకో రౌండ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేసి ఒక్కో రౌండ్‌లో 14 ఈవీఎంలు లెక్కిస్తారు. ఇలా 20 రౌండ్లలో లెక్కించేటట్లు ఏర్పాట్లు చేశారు.

కట్టావారిపాలెం నుంచి ఓట్ల లెక్కింపు

నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కట్టావారిపాలెం గ్రామంలోని పోలింగ్ బూత్ ఒకటి నుంచి ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి 31వ పోలింగ్ బూత్ లక్కరాజు గార్లపాడు వరకు 76 పోలింగ్ బూత్ గండ్లూరు నుంచి 119 ధూళిపాళ్ల వరకు సత్తనపల్లి రూరల్ పరిధిలోకి రానుంది. 32వ పోలింగ్ బూత్ నుంచి సత్తెనపల్లి అర్బన్‌లోకి ఎంటర్ అవుతుంది. 32 పోలింగ్ బూత్ నుంచి 75వ పోలింగ్ బూత్ వరకు, 274 సత్తెనపల్లి అర్బన్‌లోని రంగా కాలనీ తో సత్తెనపల్లి అర్బన్ ముగుస్తుంది. 120 పోలింగ్ బూత్ నుంచి రాజుపాలెం మండలం రెడ్డిగూడెంతో ప్రారంభమై 162 పోలింగ్ బూత్ ఉప్పలపాడుతో రాజుపాలెం మండలం ముగుస్తుంది. 163వ పోలింగ్‌బూత్‌తో నకరికల్లు మండలం చల్లపల్లి తండాతో ప్రారంభమై 229వ పోలింగ్ బూత్ చేజర్లతో నకరికల్లు మండలం ముగుస్తుంది. 230 పోలింగ్ బూత్ నుంచి ముప్పాళ్ళ మండలం కుందురువారిపాలెం నుంచి ప్రారంభమై 273 ఇరుకుపాలెంతో ముప్పాళ్ళ మండలం ముగుస్తుంది. ఇందులో సత్తెనపల్లి రూరల్ 75 పోలింగ్ బూత్‌లు, సత్తెనపల్లి అర్బన్‌లో 45 పోలింగ్ బూత్‌లు, రాజుపాలెం మండలంలో 47 పోలింగ్ బూత్‌లు, నకరికల్లు మండలంలో 63 పోలింగ్ బూత్‌లు, ముప్పాళ్ళ మండలంలో 44 పోలింగ్ బూత్‌లు వస్తాయి. కాగా నియోజకవర్గంలో మొదటి పోలింగ్ బూత్ కట్టావారిపాలెంలో మొదటి ఓటు ఆషా దీప్తి కొటాచారి వినియోగించుకోగా నియోజకవర్గంలో చివరి ఓటు పట్టణం లోని రంగా కాలనీకి చెందిన 274 పోలింగ్ బూత్‌లో 879 శివనాగమల్లేశ్వరి ఎబ్బిలికి దక్కింది.

కౌంటింగ్ రోజు పటిష్ట భద్రత

- అల్లర్లు, ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెటింగ్‌లు
- పోలీసులకు సహకరించాలి: సీఐ మంగారావు



మాట్లాడుతున్న సీఐ మంగారావు, పక్కన అమరావతి సీఐ బ్రహ్మం

క్రోసూరు: ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా మండలంలో పోలీసులు ముమ్మర తనిఖీలు, భద్రతా చర్యలు చేపట్టారు. జూన్ నెల 4న ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు పూర్తిగా సహకరించాలని సీఐ మంగారావు ఆదివారం కోరారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ నుంచి గ్రామ శివారు వరకు పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాల సీఐలు, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. అమరావతి బస్టాండు సెంటర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ మంగారావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 3, 4 తేదీల్లో అన్ని వ్యాపార సంస్థలు, దుకాణాలు మూసివేయాలని చేయాలని, నలుగురు కలిసి తిరగరాదని చెప్పారు. అల్లర్లకు పురిగొల్పడం, బాణ సంచా కాల్చడం, సంబరాలు నిర్వహించటం నిషిద్ధమని స్పష్టం చేశారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకుల సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సమస్యాత్మక కాలనీల్లో ఇంటింటికీ సోదాలు చేపట్టామని, ద్విచక్ర వాహనాలు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి సీఐ బ్రహ్మం, అచ్చంపేట సీఐ కరిముల్లాషా వలి, ఎస్ఐ షఫీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యం

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా పెట్టుకున్నామని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు అన్నారు. ఎన్నికలకు సంబంధించిన పలు విషయాలను ఆదివారం ఆయన వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో పెట్రోల్ బాంబులు లభించిన నేపథ్యంలో ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 500 మందిని ఎన్నికలకు ముందు బైండోవర్ చేశామని, బైండోవర్ చేసిన వారిలో 46 మంది ఎన్నికల అల్లర్లలో మళ్లీ భాగస్వాములు అయినట్లు గుర్తించామన్నారు. వారిలో 35 మందిని ముప్పాళ్ళ తహసీల్దారు సమక్షంలో బాండ్ అమౌంటు ప్రభుత్వానికి చెల్లించాల్సిందిగా నోటీసులు ఇచ్చామన్నారు. వీరిలో 16 మంది మాత్రమే హాజర య్యారన్నారు. సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 30 మందిపై రౌడీ షీట్లు ఓపెన్ చేశామన్నారు. నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన కేసులో ఇప్పటి వరకు 25 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇంకా కొంతమంది తప్పించుకు తిరుగుతున్నారని, వారిని కూడా త్వరలో అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని సమస్యా త్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్డన్ సెర్చ్ లో భాగంగా ఎటువంటి ఆధారాలు లేని వాహనాలను గుర్తిస్తే వాటిని సీజ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే ఎంతటివారినైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు పూర్తి సహకారం పోలీసు లకు అందించాలని కోరారు.

ముగిసిన కరాటే శిక్షణ తరగతులు



కరాటే విన్యాసాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

యడ్లపాడు: నేటి సమాజంలో ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరమని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరు సృజన తెలిపారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 20 రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం గంటన్నర పాటు కరాటేలో విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా బాలికలకు ఆత్మ రక్షణ కోసం యుద్ధకళ తప్పనిసరి అన్నారు. ఇదే వేదికపై కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. కరాటే శిక్షకుడు రామకృష్ణ మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థులు త్వరలోనే చిలకలూరిపేటలో జరిగే కరాటే పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందినవారందరికీ సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. ఈ సందర్భంగా యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ తరపున రామకృష్ణను ఘనంగా సత్కరించారు.పోపూరి వెంకటేశ్వర్లు(చిన్న), అభివృద్ధి కమిటీ సభ్యులు కేతా రాంబ్రహ్మం, ఆరే వంశీ, పీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు నూతలపాటి కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మాచర్ల: పట్టణంలోని 22వ వార్డులో లీలావతి అనే మహిళపై వెంకటేశ్వర్లు అనే యువకుడు శనివారం అర్ధరాత్రి దాడి చేశాడు. దీనిపై బాధిత మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. బాధిత మహిళకు, వెంకటేశ్వర్లుకు మధ్య ఘర్షణ జరిగింది. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని త్రైత సిద్ధాంత సేవకులు ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని రజక కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ వెనుక బజారులో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి ప్రజలకు పుస్తకాలను పంపిణీ చేశారు. త్రిమాత ఏకైక గురువు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ సభ్యులు కటకం సైదారావు, సభ్యులు కె.అరుణ, కోటేశ్వరరావు, నారాయణమ్మ, గోపి, డి.శ్రీను, ఎం.వీరయ్య, ఎస్. వెంకటలక్ష్మి, సీహెచ్ అనురాధ, టి.రాఘవ, ఎం.అమర్, బి.చిరంజీవి, బి.శివ, వెంకటరామిరెడ్డిలు ప్రచారంలో పాల్గొన్నారు.

సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలోని భగవాన్ శ్రీ సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం 19వ రోజు సందర్భంగా పట్టణానికి చెందిన వంశీ ఫార్మసీకి చెందిన, కొత్త వెంకట పూర్ణచంద్రరావు, లలిత ఆర్థిక సహాయంతో మజ్జిగ చలివేంద్రం ద్వారా సుమారు 2 వేల మందికి చల్లటి మజ్జిగను పంపిణీ చేశారు. మజ్జిగతోపాటు స్వామి వారి ప్రసాదం కూడా అందజేశారు. అనంతరం మంచినీటి చలివేంద్రం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగవాన్ సత్యసాయి మందిరం కన్వీనర్ గర్నె నాగేశ్వరరావుతోపాటు సత్యసాయి సేవా భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ఒయాసిస్ సంస్థ సభ్యులు

చిలకలూరిపేట: ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. పట్టణంలోని కేజీ ఆసుపత్రి ప్రాంగణంలో ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 22 మందికి రూ. 1,30,000 ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువశాతం పేద విద్యార్థులే విద్యాభ్యాసం చేస్తున్న నేపథ్యంలో అలాంటి విద్యార్థులను గుర్తించి ప్రతి ఏటా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ సంస్థ సభ్యులు అందజేసిన ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకొని పై చదువులు కొనసాగించాలని కోరారు. దాతలు అల్లం కృష్ణవేణి, టి.అనురాధ, ఎండీ కరిమా, పి.రాధా, పి.కీర్తి, జి.లక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, డాక్టర్ వై.మధులత, కోలా విజయలక్ష్మి, కరణం విజయలక్ష్మి, చెరుకుపల్లి నిర్మల, కందిమళ్ల నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఏసు చూపిన బాటలో నడవాలి



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసంతో జీవించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజ కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. తోటివారిని ప్రేమించటం క్రైస్తవంలో ప్రధానమన్నారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఏసు ప్రభువును ఈ ప్రపంచానికి అందించిన దివ్యమూర్తి మేరిమాత అని కొనియాడారు. దీనికి ముందు పలువురు భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



పిన్నెల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీస్ ప్రత్యేక బలగాలు

మాచవరం: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అమీనుద్దీన్ హెచ్చరించారు. పోలింగ్ అనంతరం గ్రామాల్లో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని పిన్నెల్లి, మాచవరం గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని పిన్నెల్లి, మోర్జంపాడు, కొత్తగణేశునిపాడు గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి, అనుమానిత ప్రాంతాల్లో సోదాలు జరిపినట్లు తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు. అల్లర్లు, గొడవలకు పాల్పడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.

వేగంగా మల్లికార్జునస్వామి దేవస్థానం నిర్మాణ పనులు



యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం పునఃనిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సుమారు రెండు శతాబ్దాల నాటి ఈ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు సమష్టిగా పునఃనిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే బేస్ మట్టం పనులు ముగిసి గర్భగుడి, అంతరాలయం, ఉపాలయ పనులు కొనసాగుతున్నాయి. ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు ఇతోధితంగా విరాళాలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కాదలచిన వారు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

చేజర్లలో కార్డన్ సెర్చ్

కర్రలు, రాడ్లు, గాజు బాటిళ్లు స్వాధీనం



చేజర్లలో కౌన్సెలింగ్ ఇస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు

నకరికల్లు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు హెచ్చరించారు. మండలంలోని చేజర్ల గ్రామంలో ఆదివారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద గృహాల్లో తనిఖీలు చేసి, కర్రలు, రాడ్లు, గొడ్డళ్లు, గాజు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ ఎం.రాంబాబు మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉంటుందన్నారు. జూన్ 4న లెక్కింపు సందర్భంగా ఆవేశాలకు పోయి అనర్థాలు తెచ్చుకోవద్దన్నారు. గ్రూపులుగా విడిపోయి కొట్టుకుంటే బైండోవర్ కేసులతో పాటు అవసరమైతే రౌడీషీట్‌లు, పీడీ యాక్టులు నమోదు చేస్తామన్నారు. ఎలక్షన్ తగాదాల్లో పాల్గొంటే కేసులు ఎదుర్కొని కోర్టుల చుట్టూ తిరిగాల్సి వస్తుందన్నారు. శాంతిభద్రతలు నెలకొల్పేందుకు సహకరించాలని సూచించారు. ఆలోచనతో పరివర్తన తెచ్చుకొని ప్రశాంతమైన జీవనం గడపాలన్నారు. తనిఖీల్లో నకరికల్లు, రాజుపాలెం, ముప్పాళ్ల ఎస్ఐలు పి.రాంబాబు, షేక్.సమీర్‌బాషా, హజరత్తయ్య, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని రథోత్సవం



స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథం వద్దకు తీసుకువస్తున్న అర్చకులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గురజాల : మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత సాక్షి వేణుగోపాలస్వామి వారి రథోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. మూడు రోజుల క్రితం జరిగిన స్వామి వారి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రథాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి స్వామి వారిని అర్చకుల వేదమంత్రాలతో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి రథానికి నీటిని వారుగా పోసి బ్రహ్మరథం పట్టారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రధాన అర్చకుడు కారంపూడి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో శాంతి హోమం, బలిహరణ, కలశహోమం వంటి పూజలు నిర్వహించారు.

కార్మికులు యాప్రాన్ ధరించాలి

మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి



నూతన యాప్రాన్‌లను ఆవిష్కరిస్తున్న కమిషనర్, అధికారులు

నరసరావుపేటః ప్రతి మున్సిపల్ కార్మికుడు పని చేసే సమయంలో తప్పకుండా యాప్రాన్ ధరించాలని కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కార్యాలయంలో కార్మికులకు నూతనంగా అందజేసే యాప్రాన్‌లను ఆవిష్కరించారు.. ఈసందర్భంగా మాట్లాడుతూ యాప్రాన్ ధరించటం వలన వార్డు ప్రజలు గుర్తించి ఇళ్లల్లోని చెత్తను అందజేస్తారన్నారు. లేనిపక్షంలో వారు కార్మికులను గుర్తించకుండా రోడ్లపై పడేస్తారని గుర్తు చేశారు. దీని వలన ప్రజలకు వారి బాధ్యత కూడా గుర్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ రామకోటయ్య, అసిస్టెంట్ ఇంజనీరు నాయక్ పాల్గొన్నారు.